17,654 కంపెనీలు బంద్



గత 10 నెలల్లో మూతబడినట్టు రాజ్యసభలో ప్రకటించిన కేంద్రప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశవ్యాప్తంగా 17వేలకుపైగా కంపెనీలు మూతబడ్డాయి. మంగళవారం రాజ్యసభలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష మల్హోత్రా ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానం ప్రకారం.. గత ఏడాది ఏప్రిల్ మొదలు ఈ ఏడాది జనవరి 26 వరకు మొత్తం 17,654 సంస్థలు షట్‌డౌన్ అయ్యాయి. అయితే వీటిలో ఇతర సంస్థల్లో విలీనమైనవి, బడా సంస్థలకు అమ్ముడైనవి, నష్టాలతో చేతులెత్తేసినవి, ఆర్థిక సమస్యలతో మూతబడినవి అన్నీ ఉన్నాయని మంత్రి వివరించారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) 22,044, అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) 84,801 కంపెనీలు బంద్ అయినట్టు తెలుస్తున్నది. మరోవైపు గడిచిన దాదాపు 10 నెలల్లో దేశంలో కంపెనీల చట్టం కింద కొత్తగా 1,38,027 కంపెనీలు నమోదైనట్టు కూడా మంత్రి తెలిపారు. అలాగే 2023-24లో 1,85,318 కంపెనీలు, 2022-23లో 1,59,302 కంపెనీలు నమోదయ్యాయి. ఇకపోతే గత ఐదేండ్లలో దేశంలో 339 విదేశీ కంపెనీలు ఏర్పాటయ్యాయని మల్హోత్రా వెల్లడించారు. ఈ ఏడాదిలో ఏపీ, ఢిల్లీ, కేరళల్లో ఒక్కోటి.. తమిళనాడులో రెండు వచ్చాయన్నారు. నిజానికి 2020 నుంచి భారత్‌లో విదేశీ సంస్థల నమోదు క్రమేణా తగ్గుతున్నట్టు చెప్పారు.

82 దర్యాప్తుల్లో నివేదికలు

గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం (ఎస్ఎఫ్ఐవో) 82 దర్యాప్తు నివేదికల్ని సమర్పించినట్టు మంత్రి మల్హోత్రా తెలిపారు. కేవలం గత ఆర్థిక సంవత్సరంలోనే 2023-24 గరిష్ఠంగా 40 రిపోర్టులు వచ్చాయని వివరించారు. అయినప్పటికీ నయాపైసా రికవరీ లేదని స్పష్టం చేశారు. ఇక ఈ మూడేండ్లలోనే ఎస్ఎఫ్ఐవోకు మరో 26 కేసులను కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అప్పగించినట్టు చెప్పారు. గడిచిన ఐదేండ్లలోనైతే ఈ సంఖ్య 72గా ఉందన్నారు.

2,664 విల్‌ఫుల్ డిఫాల్టర్లు

గత ఏడాది మార్చి ఆఖరుకల్లా 2,664 మంది ప్రత్యేక రుణగ్రహీతలను ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులుగా వర్గీకరించినట్టు ఓ లిఖితపూర్వక సమాధానంలో రాజ్యసభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. వీరిలో వ్యక్తిగత, విదేశీ రుణగ్రహీతలెవరూ లేరని స్పష్టం చేశారు. రుణాలను ఎగ్గొడుతున్నవారిపై కఠిన చర్యలను తీసుకొనేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో కలిసి కేంద్రం పనిచేస్తున్నట్టు వివరించారు.

86 వేలకు చేరువలో పుత్తడి

మరో రూ.500 పెరిగి రూ.85,800కి పదిగ్రాముల ధర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. సామాన్యుడికి అందనంత స్థాయికి చేరుకుంటున్న పుత్తడి మరో మైలురాయికి చేరువైంది. వరుసగా ఐదు రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధర మంగళవారం కూడా మరో రూ.500 ఎగబాకి రూ.86 వేలకి చేరువైంది. దేశరాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.500 పెరిగి రూ.85,800 పలికింది. ఆభరణాలు, రిటైలర్ల నుంచి డిమాండ్ అత్యధికంగా ఉండటం వల్లనే ధరలు పెరిగాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. జనవరి 1 నుంచి ఇప్పటి వరకు గోల్డ్ ధర రూ.6,410 లేదా 8 శాతం ఎగబాకి రూ.85,800కి చేరుకున్నది. నెల రోజుల క్రితం ఈ ధర రూ.79,380గా ఉన్నది. గత ఐదురోజులుగా పెరుగుతూ వచ్చిన వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉండటంతో కిలో వెండి రూ.500 తగ్గి రూ.95,500కి పరిమితమైంది. ధరలు తగ్గకముందు ఇది రూ.96 వేలుగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర రికార్డు స్థాయి 2,872 డాలర్లకు చేరుకున్నది. కెనడా, మెక్సికో దేశాలపై ట్రంప్ విధించిన పన్ను వాయిదాపడటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి.

భయపడి మూసేయలేదు

కంపెనీ షట్‌డౌన్‌పై హిండెన్‌బర్గ్ అధినేత అండర్సన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అదానీ గ్రూప్ అవకతవకలపై సంచలనాత్మక రిపోర్టుల్నిచ్చిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్.. అనూహ్యంగా మూతబడిన విషయం తెలిసిందే. అయితే ఎవరికీ భయపడి తాను సంస్థను మూసేయలేదని ఈ అమెరికన్ షార్ట్ సెల్లర్ వ్యవస్థాపక అధినేత నాథన్ అండర్సన్ స్పష్టం చేశారు. తమపై లీగల్‌గాగానీ లేక వ్యక్తిగతంగాగానీ ఎవరూ ఏ రకమైన బెదిరింపులకు దిగలేదన్న అండర్సన్.. కేవలం పని ఒత్తిడి కారణంగానే హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేసినట్టు పీటీఐకిచ్చిన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్లలో అక్రమాలకు పాల్పడిందంటూ 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రిసెర్చ్ ఓ రిపోర్టును విడుదల చేసిన సంగతి విదితమే. దీంతో అదానీ కంపెనీల షేర్లన్నీ ఒక్కసారిగా కుప్పకూలాయి. తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నాయి. ఫలితంగా అటు గ్రూప్, అదానీ వ్యక్తిగత సంపద ఏకంగా 150 బిలియన్ డాలర్లకు పైగా కరిగిపోయింది. వ్యాపార-పారిశ్రామిక వర్గాల్లోనేగాక, రాజకీయంగానూ ఇది తీవ్ర దుమారాన్నే రేపింది. ఇక ఈ వ్యవహారంలో సెబీ చీఫ్ మాధవీ పురి బచ్ దంపతుల హస్తం కూడా ఉందని గత ఏడాది ఆగస్టులో మరో బాంబు పేల్చింది. దీంతో పార్లమెంట్‌లోనూ ఆ ప్రకంపనలు కనిపించాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 16న ఆశ్చర్యకరంగా హిండెన్‌బర్గ్ రిసెర్చ్‌ను మూసేస్తున్నట్టు, తమవద్ద అన్ని కేసుల దర్యాప్తులు అయిపోయినట్టు అండర్సన్ చెప్పారు. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. తాజా ఇంటర్వ్యూలోనూ అదే చెప్పారు. 2017లో మొదలైన ఈ కంపెనీ.. 8 ఏండ్లలో అనేక దేశ, విదేశీ కంపెనీలపై సంచలన రిపోర్టుల్నిచ్చింది. ఆ వివరాలను అమెరికా స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్లు, దర్యాప్తు ఏజెన్సీలకు పంపింది.

ఎన్ఎస్ఈ లాభం 3,834 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశంలో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఈ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.3,834 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.1,975 కోట్ల లాభంతో పోలిస్తే 94 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో ఆదాయం ఏడాది ప్రాతిపదికన 21 శాతం ఎగబాకి రూ.3,974 కోట్ల నుంచి రూ.4,807 కోట్లకు చేరుకున్నది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లో రూ. 45,499 కోట్ల ఆదాయంపై రూ.14,780 కోట్ల నికర లాభాన్ని గడించింది.

మళ్లీ 78 వేల పైకి సెన్సెక్స్

1,400 పాయింట్లు లాభపడ్డ సూచీ • 380 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ

ముంబై, ఫిబ్రవరి 4: దేశీయ స్టాక్ మార్కెట్లు రివ్వున ఎగిశాయి. మెక్సికో, కెనడాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా వాయిదావేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా పుంజుకున్నాయి. ఇదే క్రమంలో గత కొన్ని రోజులుగా నష్టాలు ఏరులైపారుతున్న దేశీయ మార్కెట్లు కదంతొక్కాయి. మదుపరులుగు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ ఇంట్రాడేలో 1,472 పాయింట్లు లేదా 2 శాతం వరకు లాభపడింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 1,397.07 పాయింట్లు లేదా 1.81 శాతం అందుకొని 78,584.81 పాయింట్ల వద్దముగిసింది. దీంతో సూచీలు నెల గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు అయింది. మరోసూచీ నిఫ్టీ సైతం 378.20 పాయింట్లు లేదా 1.62 శాతం అందుకొని 23,739.25 వద్ద ముగిసింది. జనవరి 3 తర్వాత సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. రిజర్వుబ్యాంక్ తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. దీంతో 6 లక్షల కోట్ల మదుపరుల సంపద పెరిగింది. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.5,95,996.51 కోట్లు పెరిగి రూ.4,25,50,826.11 కోట్లు(4.88 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. వాణిజ్య యుద్ధానికి తెరలేపిన ట్రంప్..ఇతర దేశాల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో రెండు దేశాలపై విధించిన టారిఫ్ విషయంలో వెనక్కి తగ్గడం సూచీల్లో జోష్ పెంచిందని మోతీలాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ సిద్ధార్థ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌పై మదుపరులు వేచి చూసే దోరణి అవలంభించినప్పటికీ గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలు పెరగడానికి ప్రధాన కారణం.

- ఎల్అండ్‌టీ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- అదానీ పోర్ట్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, టాటా మోటర్స్, రిలయన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, టాటా స్టీల్, మహీంద్రా, ఎయిర్‌టెల్, టైటాన్, ఐటీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఐటీసీ హోటల్స్, జొమాటో, నెస్లె, మారుతి, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్ 3.42 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.59 శాతం, ఎనర్జీ 2.50 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.40 శాతం, పవర్ 2.31 శాతం, ఆర్థిక సేవలు 2 శాతం చొప్పున లాభపడ్డాయి. కానీ, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు పతనం చెందాయి.

టాటా కార్లపై భారీ డిస్కౌంట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఎంపిక చేసిన మాడళ్లపై టాటా మోటర్స్ తాజాగా లక్ష రూపాయల వరకు తగ్గింపు ప్రకటించింది. వీటిలో టియాగో, టిగోర్, ఆల్ట్రోజ్, పంచ్, నెక్సాన్, హరియర్, సఫారీ మాడళ్లున్నాయి. పెట్రోల్/సీఎన్‌జీ రకాల విషయానికొస్తే.. టియాగో మాడల్‌పై రూ.35 వేలు రాయితీ ఇస్తున్నది. రూ.20 వేలు కన్స్యూమర్ డిస్కౌంట్, మరో రూ.15 వేలు ఎక్స్ఛేంజ్ డిస్కౌంట్‌లున్నాయి. ఇలాగే టిగోర్‌పై రూ.45 వేలు, ఆల్ట్రోజ్‌లో రేసర్ మినహా మిగతా వేరియంట్లపై రూ.65 వేలు, పంచ్‌పై రూ.25 వేలు, నెక్సాన్ మాడళ్లపై రూ.45 వేల రాయితీలున్నాయి. ఇక ఎస్‌యూవీ మాడళ్లైన హరియర్, సఫారీ అన్ని డీజిల్ వేరియంట్లపై రూ.75 వేల వరకు డిస్కౌంట్ వస్తున్నది. మరోవైపు, ఆల్ట్రోజ్, నెక్సాన్ డీజిల్ అన్ని రకాలపై 65వేలు, 45వేల చొప్పున డిస్కౌంట్‌లున్నాయి. అయితే ఆల్ట్రోజ్ పెట్రోల్ రేసర్ వేరియంట్‌పై గరిష్ఠంగా లక్ష డిస్కౌంట్ ఉన్నది. జనవరిలోనూ కంపెనీ రూ.85 వేల తగ్గింపునిచ్చినది తెలిసిందే.

హీరోకు 456 కోట్ల జీఎస్టీ నోటీసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశీయ ఆటోరంగ దిగ్గజం, ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్‌కు రూ.456.06 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. రాజస్థాన్‌లోని అల్వార్ సెంట్రల్ జీఎస్టీ అదనపు కమిషనర్ నుంచి ఈ తాఖీదులు అందాయి. 2017 జూలై నుంచి 2024 మార్చి వరకు సరఫరా జరిగిన వాహన విడిభాగాలు, ఇతర రత్రా వాటి ధరలకు సంబంధించిన వ్యవహారంలో ఈ నోటీసులు జారీ అయ్యాయి. మరోవైపు ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీకి కూడా రూ.101. 95 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు వచ్చింది. గత ఐదు ఆర్థిక సంవత్సరాలకుగాను ఆయా రాష్ట్రాల్లో జీఎస్టీ షార్ట్ పేమెంట్లకు సంబంధించి ఈ నోటీసు విడుదలైందని మంగళవారం ఎల్ఐసీ తెలిపింది. కాగా, త్వరలో జీఎస్టీ శ్లాబులు, రేట్లపై జీఎస్టీ కౌన్సిల్ ఓ నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 4: వరంగల్ దేశాయిపేట సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు. పోచమ్మమైదాన్ సర్కిల్, కల్యాణి నగర్, టీచర్స్ కాలనీ, నవయుగ కాలనీ, గణేశ్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మరమ్మతులు చేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నర్సంపేట, ఫిబ్రవరి 4: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన పట్టణంలోని శాంతినగర్‌లో మంగళవారం జరిగింది. శాంతినగర్‌కు చెందిన మచ్చిక కల్యాణి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి కొంత వరకు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో వంట సామగ్రి, దుస్తులు, గృహోపకరణాలు కాలిపోయాయి. రూ. 2 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు కల్యాణి తెలిపింది.

యువకుడిపై పోక్సో కేసు

కరీమాబాద్, ఫిబ్రవరి 4: ఓ యువకుడు బాలికను గర్భవతిని చేసిన ఘటన వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఇంటర్ చదువుతున్న బాలికను అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు మాయ మాటలు చెప్పి గర్భవతిని చేశాడు. కొంతకాలంగా కూతురు ప్రవర్తనలో మార్పులు గమనించిన తల్లిదండ్రులు ఆరా తీయగా విషయం బయటపడింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు నిందితుడిపై అట్రాసిటీ, పోక్సో కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డ్రోన్‌ను ప్రారంభిస్తున్న మార్కెట్ కార్యదర్శి నిర్మల

ఆధునిక వ్యవసాయ పనిముట్లు వినియోగించాలి

కాశీబుగ్గ, ఫిబ్రవరి 5: మారుతున్న కాలాన్ని బట్టి రైతులు ఆధునిక వ్యవసాయ పనిముట్లను ఉపయోగించి, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించాలని ఎనుమాముల మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల సూచించారు. మార్కెట్ ప్రాంగణంలోని మన అగ్రిటెక్‌లో నూతన డ్రోన్ స్ప్రేయర్‌ను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. ఆధునిక పరికరాలతో కూలీలు లేకుండా తక్కువ సమయంలో ఎక్కువ వ్యవసాయ పనులు చేయొచ్చని సూచించారు. వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్రం అనేక పరికరాలు ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం డ్రోన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మన అగ్రిటెక్ చైర్మన్ పాశికంటి రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పిన్నింటి వెంకట్రావ్ పాల్గొన్నారు.

సీనియర్ దస్తావేజులేఖరి కుటుంబానికి పరామర్శ

నర్సంపేట, ఫిబ్రవరి 4: పట్టణంలో సీనియర్ దస్తావేజులేఖరి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. పట్టణానికి చెందిన సీనియర్ దస్తావేజులేఖరి, మాజీ కౌన్సిలర్ మండల శ్రీనివాస్ మామ రుద్ర లింగమూర్తి(87) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పెద్ది బీఆర్ఎస్ నేతలతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం జరిగిన లింగమూర్తి అంతిమయాత్రలో పాల్గొన్నారు. పెద్ది వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మాజీ కౌన్సిలర్లు నాగిశెట్టి పద్మ-ప్రసాద్, మహ్మద్ పాషా, బండి రమేశ్, నాయకులు మద్దెల సాంబయ్య, రవి, హన్మంతరావు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- ప్రజాపాలన కాదు.. ప్రజలను వేధించే పాలన
- మాజీ సర్పంచ్‌ల ధ్వజం
- ముందస్తుగా మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

సంగెం: అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

గీసుగొండ: స్టేషన్ ఆవరణలో మాజీ సర్పంచ్‌లు

దుగ్గొండి: మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన ఎస్సై

సంగెం, ఫిబ్రవరి 4: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. చలో అసెంబ్లీకి వెళ్లకుండా ముందస్తుగా మండలంలోని తాజా మాజీ సర్పంచ్‌లను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేశామని, ఇప్పటి వరకు పెండింగ్ బిల్లులు రాకపోవడంతో వడ్డీలు ఎక్కువై దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచ్‌లను అరెస్ట్ చేయడమేనా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి, తమకు మాత్రం బిల్లులు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేయిస్తున్నదని ధ్వజమెత్తారు. రుణమాఫీ కాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇది ప్రజాపాలన కాదని, ప్రజలను వేధించే పాలన అని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే తామేంటో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు పులుగు సాగర్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గుండేటి బాబు, మాజీ సర్పంచ్‌లు దొనికల రమా శ్రీనివాస్, ఇజ్జగిరి స్వప్న-అశోక్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల బైండోవర్

గీసుగొండ/దుగ్గొండి: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బుధవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం రాత్రి గీసుగొండ పోలీసులు బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు అంకతీ నాగేశ్వర్‌రావు, బోడకుంట్ల ప్రకాశ్, నమిండ్ల రమ రాజు, వీరాటి కవితా రవీందర్‌రెడ్డిని ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై మంగళవారం మధ్యాహ్నం విడుదల చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. కమిషన్లు ఇస్తేనే బిల్లులు ఇస్తారా అని ప్రశ్నించారు. అలాగే, దుగ్గొండి మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు మోడెం విద్యాసాగర్, ఓడెటి తిరుపతిరెడ్డి, రేవురి సురేందర్‌రెడ్డి ఉన్నారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలన అందిస్తున్న రేవంత్‌రెడ్డి వెంటనే తమ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మర్రిరెడ్డి వెంకటరెడ్డి

'కార్పొరేట్, మిత్రపక్షాలకే కేంద్ర బడ్జెట్ పరిమితం'

వరంగల్‌చౌరస్తా, ఫిబ్రవరి 4: దేశాన్ని దోచుకుతింటున్న కార్పొరేట్ శక్తులు, బీజేపీ పాలిత రాష్ట్రాలు, ఎన్‌డీఏ కూటమి పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలకు మాత్రమే బడ్జెట్ కేటాయింపులు జరిగాయని ఎంసీపీఐ పోలిట్ బ్యూరో సభ్యుడు మర్రిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. అబ్బనికుంటలోని తెలంగాణ రైతు భవన్‌లో పొనుగంటి నర్సయ్య అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్‌డీఏ కూటమి రాష్ట్రాలకు మాత్రమే ఫలితాలు దక్కేలా బడ్జెట్ రూపకల్పన చేసిందని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాసామ్య విధానాలకు పూర్తి వ్యతిరేకమని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్రం బడ్జెట్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు మోర్తాల చందర్‌రావు, సింగతి సాంబయ్య, భాషుపాక బాబు, చంద్రశేఖర్, తిరుపతి, భాషిపాక రమేశ్ పాల్గొన్నారు.

వర్గీకరణ అయ్యే వరకూ పోరాటం

సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్

వర్ధన్నపేట, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసే వరకూ మాదిగల పోరాటం ఆగదని ప్రముఖ సినీ గేయ రచయిత మిట్టపల్లి సరేందర్ అన్నారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు.. వేల గొంతుకల సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన అంబేద్కర్ సెంటర్‌లో ఆవిష్కరించారు. సుప్రీంకోర్టు తీర్పును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బిర్రు మహేందర్, జన్ను రాములు, ఎర్ర సంతోష్, బకిగె బాబు, మాసాని గోపాల్, గోలి సుధాకర్, ధర్మయ్య, అంజయ్య, శ్రీనివాస్, బరిగెల యాకయ్య, చంద్రమౌళి, కుమార్, రాజు, ప్రభాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మిట్టపల్లి సురేందర్

గీత కార్మికులపై సర్కారు నిర్లక్ష్య ధోరణి

మాట్లాడుతున్న ప్రతినిధులు

రాయపర్తి, ఫిబ్రవరి 4: రాష్ట్రంలోని కల్లుగీత కార్మికులపై కాంగ్రెస్ ప్రభుతం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నదని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్నె వెంకట మల్లయ్య ఆరోపించారు. మండలంలోని కొండూరు గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌లో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వామి అధ్యక్షతన మంగళవారం కల్లుగీత కార్మికుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వృత్తిలో మరణిస్తే బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఎక్స్‌గ్రేషియా నిధులు కూడా విడుదల చేయడం లేదని మండిపడ్డారు. సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం మండల నాయకులు పులి సోమయ్యగౌడ్, నాళ్లం రవి, బాలబోయిన రాంబాబుగౌడ్, మేరుగు రమేశ్, బాలగోని భిక్షపతి, మండల నరేందర్, కోలుకొండ నారాయణ, చిలువేరు అంజయ్య పాల్గొన్నారు.

బిల్లు చెల్లిస్తేనే.. వాహనాలు ఇస్తాం..

- రెండేళ్లుగా టాటా మోటర్స్‌లో మూడు స్వీపింగ్ మిషన్లు
- అధికారులు మాట్లాడినా ససేమిరా అంటున్న షోరూం యాజమాన్యం

వరంగల్, ఫిబ్రవరి 4: బిల్లు చెల్లించండి.. వాహనాలు తీసుకెళ్లండి.. ఎన్ని మాటలు చేప్పినా వినేది లేదు అంటూ బల్దియా అధికారుల ముఖం మీదే టాటా మోటర్స్ షోరూం సిబ్బంది చెప్పిన సమాధానం. రెండు వాహనాలు పంపించి ఒక వాహనం వర్క్‌షాపులో ఉంచుకోండ